గోల్కొండ కోటకు పర్యాటకుల తాకిడి

గోల్కొండ: చారిత్రక కట్టడమైన గోల్కొండ కోటకు పర్యాటకులు పోటెత్తారు. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఆదివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోటలోని ఆయుధాగారం, క్లాపింగ్ పోర్టిపో వద్ద గల ఫిరంగి వద్ద పర్యాటకులు సెల్ఫీలు దిగారు. అంతేగాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు నగీనా బ్యారెక్స్‌లోని రహస్య గదులను సందర్శించారు. శ్రీరామ భక్తులు కోట ఎగువ భాగంలో గల భక్త రామదాసు చరసాలను చూసి పరవశులయ్యారు.

గౌలిగూడలో బీపీ మండల్ జయంతి


నివాళులర్పిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: గౌలిగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బిహార్ మాజీ సీఎం బీపీ మండల్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీపీ మండల్ బీసీల సంక్షేమం, వారి హక్కుల పోరాటానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జయదీప్ యాదవ్, దుర్గేశ్, పరీక్షిత్‌యాదవ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్

గౌలిపురా: గణేశ్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ సూచించారు. మొఘల్‌పురా స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర మఠం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, సలహాలను తప్పకుండా పాటించాలన్నారు. కేవలం భక్తి గీతాలను మాత్రమే పెట్టాలన్నారు. రాత్రి సమయాల్లో విగ్రహం వద్ద ఇద్దరు భక్తులు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ నెల 27 నుంచి 6 వరకు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసుకునేందుకు అవకాశముందని నిర్వాహకులు వినియోగించుకోవాలన్నారు. ఎంట్రీ చేసుకున్న మండపాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వినాయక ఉత్సవాల సందర్భంగా పోలీస్‌స్టేషన్ లెవెల్‌లో వాట్సాప్ గ్రూపు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిర్వాహకులకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ కళలను కాపాడుకుందాం


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

గన్‌ఫౌండ్రీ: భారతీయ శాస్త్రీయ కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలువురు ప్రముఖులు అన్నారు. రవీంద్రభారతీలో మైథిలి ఆర్ట్స్ అకాడమీ పదో వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నాట్యగురువు పసుమర్తి శేషుబాబు మాట్లాడుతూ.. సంస్థకు చెందిన చిన్నారులు నృత్య ప్రదర్శనలు భారత్ వరల్డ్ రికార్డ్స్, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డుల్లో నమోదు కావడం అభినందనీయమన్నారు. అనంతరం యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాతీయ కో ఆర్డినేటర్ కేవీ.రమణారావు ఆమెకు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు. అంతకుముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సినీ దర్శకుడు ఎస్‌ఆర్.రెడ్డి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు పీ అశోక్‌కుమార్, సినీ నటి కావేరి, సంస్థ అధ్యక్షురాలు మైథిలి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలి


అవార్డు గ్రహీతలతో డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్

గన్‌ఫౌండ్రీ: ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. రవీంద్రభారతీలో మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతరత్న మదర్‌థెరిస్సా 114వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి సేవారత్న అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేస్తున్న వ్యక్తులను గుర్తించి అవార్డులు ఇవ్వడం వల్ల ఇతరుల్లో స్ఫూర్తి కలుగుతుందన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, ఎస్‌సీఆర్‌టీ అడిషనల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీకే.రెడ్డి, ప్రభుత్వ పూర్వ న్యాయవాది డీఎల్.పాండు, సంస్థ వ్యవస్థాపకుడు ఎ.మల్లిఖార్జున్ రావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పబ్‌లపై కేసులు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న రెండు పబ్‌లపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం జూబ్లీహిల్స్‌లోని లార్డ్స్ ఆఫ్ డ్రింక్స్, బ్రాండ్ వే పబ్‌లు శనివారం రాత్రి తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమయ్యాయి. ఈ రెండు పబ్బుల యాజమాన్యం వాహనాలు నిలిపేందుకు సరైన సౌకర్యం కల్పించకపోవడంతో వాహనాలన్నీ రోడ్డు మీద నిలిచాయి. దీంతో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత 12.40 గంటల నుంచి 1.30 గంటల వరకు పబ్బుల మీద తీవ్రంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. కాగా రాత్రి విధుల్లో ఉన్న ఎస్‌ఐ సోమశేఖర్ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీశారు. ట్రాఫిక్‌ను సరిదిద్దారు. పోలీసులు ఈ రెండు పబ్‌ల పై సుమోటోగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గన్‌ఫౌండ్రీ: మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అబిడ్స్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అఖిల భారత విద్యా సంఘాల సమైక్య, తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మహిళా సాధికారతపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఏర్పడగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకంపైనే తొలి సంతకం చేసినట్లు గుర్తుచేశారు. దీని ద్వారా ఇప్పటివరకు 81 కోట్ల మంది ప్రయాణించారని తెలిపారు. మహిళా సాధికారతలో భాగంగానే అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మౌలిక వసతుల కల్పనలో మహిళలను భాగస్వాములు చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో ప్రతి మండల కేంద్రంలో ఇంటర్నేషనల్ స్థాయి పాఠశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సమావేశంలో శాసన సభ్యులు నాగరాజు, ప్రొఫెసర్ వై.ప్రశాంతి, అఖిలభారత విద్యా సంఘాల సమైక్య అధ్యక్షుడు సుధీర్‌కుమార్, స్టాన్లీ కళాశాల చైర్మన్ కె.కృష్ణారెడ్డి, కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాశ్, టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు కే రమేశ్, ప్రధానకార్యదర్శి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహంకాళి బోనాలు


అమ్మవారిని దర్శించుకున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

నాంపల్లి: మాసాబ్‌ట్యాంక్‌లోని మహంకాళి ఆలయంలో ఆదివారం బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. పోతురాజుల విన్యాసాల మధ్య భక్తులు, అలాగే ఎస్.పల్లవి వెండిబోనాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజులతో కలిసి సాయిష్‌రెడ్డి చేసిన నృత్యం ఆకట్టుకున్నది. ఆలయ వ్యవస్థాపకుడు కంచర్ల దశరథరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు సుధాకర్ శర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ హనుమంతరావు, మండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, టామ్‌కామ్ మాజీ చైర్మన్ రంగారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు వేంరెడ్డి నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి కాశీరెడ్డి పాండురంగారెడ్డి, మాజీ అధ్యక్షుడు వంగాల సంజీవరెడ్డి, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డు అక్రమాలపై విచారణ జరిపించాలి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్

అబిడ్స్: మెట్రో వాటర్‌బోర్డులో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం ఆయన కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వాటర్, డ్రైనేజీ పైపుల ధరలు మార్కెట్‌లో తక్కువ ఉన్నప్పటికీ 25 శాతం అదనంగా ఎక్కువ రేట్లు వేసి కొనుగోలు చేశారన్నారు. విజిలెన్స్ విచారణ చేస్తే అధికారుల అవినీతి బయటపడుతుందన్నారు. ప్రజాధనం వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇప్పటికైనా వెంటనే అధికారులపై విచారణ జరపాలని కోరారు.

వైద్యులపై దాడులను అరికట్టాలి


మాట్లాడుతున్న మీర్ తౌఫిక్ అలీ

గోల్కొండ: వైద్యులపై దాడులను అరికట్టాలని ప్రముఖ సంఘ సేవకుడు మీర్ తౌఫిక్ అలీ పేర్కొన్నారు. టోలిచౌకీ వద్ద గల పీస్ ఫోర్స్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు వైద్యులపై దాడులు పెరిగిపోతున్నాయని, అలాగే పాఠశాలల్లోనూ చిన్నారులపై కూడా లైంగికదాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షిస్తేనే మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృత్తం కావాని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఏఫ్‌సీవో కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహద్, పీస్ ఫోర్స్ సొసైటీ చైర్మన్ మహ్మద్ నజీబ్, టీఏఫ్‌సీవో మహిళా విభాగం చైర్మన్ సయ్యదా సాదియా, మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

గుగ్గిరాల మూర్తి స్మారక పురస్కారాల ప్రదానం


రఘునాథ శర్మకు పురస్కారం అందజేస్తున్న కమలాకర శర్మ తదితరులు

సుల్తాన్‌బజార్: డీఏఎల్‌ఎన్ మూర్తి స్మారక సమితి ఆధ్వర్యంలో సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాష నిలయంలో శ్రీ గుగ్గిరాల మూర్తి స్మారక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. ఓయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకరా శర్మ ముఖ్య అతిథిగా హాజరై మహోపాధ్యాయ ఆచార్య చలక రఘునాథశర్మకు అవార్డు ప్రదానం చేశారు. సభ అధ్యక్షుడిగా ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యవహరించారు. అనంతరం ఆచార్య సాగి కమలాకరా శర్మ మాట్లాడుతూ.. చలకవారి సాహిత్య సేవా అనంతమని, వారి కలం నుంచి మరెన్నో గ్రంథాలు వెలువడాలని, మరెన్నో పురస్కారాలు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. సమితి కార్యదర్శి మురుమాముల దత్తాత్రేయ శర్మ నివేదిక సమర్పించారు. మధుర భారతి బిరుదాంకితులు ఆచార్య మల్లప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి విశ్వనాథవారి కల్పవృక్ష వైభవం అనే అంశంపై స్మారక ప్రసంగం చేశారు. డాక్టర్ ఆచార్య ఫణింద్ర, సాధన నర్సింహాచార్య, వాసుదేవరావు పల్లం రాజు, సత్యప్రకాశ్, సూర్య నారాయణ మూర్తి పాల్గొన్నారు.

వైద్య శిబిరం

సాక్షి సిటీ బ్యూరో: అనిల్ కుమార్, ఐపీఎస్ డైరెక్టర్ జనరల్ టీజీఎస్‌పీఎఫ్ ఆదేశాల మేరకు టీజీఎస్‌పీఎఫ్ హైకోర్టు యూనిట్ హైదరాబాద్ యందు మెడికవర్, పార్థడెంటల్, మా ఈఎన్‌టీ, న్యూ రెటీనా కంటి ఆసుపత్రుల వైద్యులు ఈ నెల 24న శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది టీజీఎస్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో అన్వర్ భాషా, కమాండెంట్, అసిస్టెంట్ కమాండెట్లు, కోటేశ్వరరావు, ఎస్ బాబురెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏ శ్రీనివాసరావు, ఎస్ సూర్యరావు, నర్సిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



'మాజీమంత్రి కేటీఆర్ గ్లోబల్స్ ప్రచారం మానుకోవాలి'


సమావేశంలో మాట్లాడుతున్న గౌరీ సతీశ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: కర్ణాటకలో జరిగిన కేసుతో తెలంగాణ ప్రభుత్వానికి ఏదో సంబంధం ఉందంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడడం హాస్యస్పదంగా ఉందని తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అన్నారు. గోబల్స్ ప్రచార సిద్ధాంతాన్ని మాజీ మంత్రి కేటీఆర్ ఆచరణలో పెడుతున్నారని ఆరోపించారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కర్ణాటకలో వాల్మీకి కేసుకు సంబంధించి అక్కడి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిందని, మరోవైపు ఈడీ విచారణ కూడా జరుగుతుందని గుర్తుచేశారు. వాల్మీకి కేసులో తెలంగాణ నాయకులకు ఏ మాత్రం సంబంధం ఉన్నా ఈడీ ఊరుకోదని స్పష్టం చేశారు. రెండు కంపెనీలకు మధ్య జరిగిన వ్యాపార సంబంధాలను పట్టుకుని మాజీ మంత్రి కేటీఆర్ తన సొంత మీడియాతో ఊదరగొట్టడం చూస్తుంటే గ్లోబల్స్ ప్రచారం అని సులువుగా అర్థమవుతుందని మండిపడ్డారు.

దొంగతనానికి వచ్చి మృత్యువాత

వెంగళరావునగర్: దొంగతనానికి వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున మధురానగర్ మెట్రోస్టేషన్ సమీపంలోని ఆగ్రా స్వీట్స్ వద్ద ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్దకు ఓ వ్యక్తి వచ్చి దొంగతనానికి ప్రయత్నించాడు. ఒక పక్క డోర్ తెరిచి రెండోది కూడా ఓపెన్ చేస్తుండగా డబ్బా పూర్తిగా ఒరిగి అతనిపై పడటంతో ఊపిరాడక మృతిచెందాడు. ఉదయం స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.డబ్బాకు ఎదురుగా ఉన్న సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా డబ్బా పడి మృతి చెందినట్లుగా తెలిసింది. ఇదిలా ఉండగా ఈ ఘటనపై పండ్ల వ్యాపారిని కొట్టి చంపారని కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్‌లో ప్రచారం చేశారు. స్పందించిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఏదైనా ఘటన జరిగినపుడు పత్రికలు, ఛానల్స్, యూట్యూబ్ విలేకరులు సంబంధిత పీఎస్ ఎస్‌హెచ్‌ఓ ద్వారా విషయాన్ని తెలుసుకుని ప్రసారం చేయాలని అంతేగాని అవాస్తవాలను వైరల్ చేయడం ద్వారా ప్రజలు ఆందోళన చెందుతారని హెచ్చరించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియలేదన్నారు.

ప్రభుత్వ శాఖల్లో వర్గీకరణ బిల్లు అమలయ్యేలా చూడాలి



గౌలిపురా: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ శాఖల్లో వర్గీకరణ బిల్లు అమలయ్యేట్లు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. గౌలిపురా అంబికానగర్‌లోని శ్రీశ్రీ మైసమ్మ ఆలయం సమీపం గ్రౌండ్‌లో ఆదివారం షెడ్యూల్డ్ క్యాస్ట్ సంక్షేమ సంఘం అంబికానగర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలతో పాటు మెడిసిన్, ఇంజినీరింగ్ లాంటి సీట్ల కేటాయింపుల్లోనూ వర్గీకరణకు అనుగుణంగా ప్రతిపాదనలు చేసి ఏబీసీడీ ఫలాలు అందేలా చూడాలన్నారు. సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ఆర్డినెన్స్ తీసుకువచ్చి వెంటనే వర్గీకరణ అమలయ్యేలా చూడాలని షెడ్యూల్డ్ క్యాస్ట్ సంక్షేమ సంఘం అంబికానగర్ ప్రధాన కార్యదర్శి రాజపాగ అర్జున్ కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బండి నరేశ్, నర్సింహా స్వామి, మంద నాగేశ్, వర్కల సత్యనారాయణ, మహేశ్, దుర్గారాజ్, గణేశ్, కె.ప్రభాకర్ బాబు, అసోసియేషన్ అధ్యక్షుడు జె.మురళీధర్ పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు


కార్పొరేటర్, నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో నానల్‌నగర్, గోల్కొండ డివిజన్ నాయకులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. గోల్కొండ ఎండీ లైన్స్ చౌరస్తా నుంచి మోతీ దర్వాజా, గోల్కొండ రిసాలబజార్, ఖాజీగల్లి తదితర ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించానన్నారు. వరద నీటి పైపులైన్ పనులు పూర్తయిన చోట భారీ గుంతలు మూసివేయించానని అలాగే టోలిచౌకీ తూమ్స్ రోడ్డులో వరద నీటి పైపులైన్ పనులు చివరి దశలో ఉన్నాయని పేర్కొన్నారు. బంజారి దర్వాజ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు అధికారులతో చర్చించామని తెలిపారు. ఫతేదర్వాజా నుంచి మోతీదర్వాజా వరకు నూతన రోడ్డు వేసి ట్రాఫిక్ జామ్‌ కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా గత వారం కురిసిన వర్షాలకు నానల్‌నగర్, లంగర్ హౌజ్ డివిజన్లలో బస్తీలు, కాలనీల్లో రోడ్లు బాగా దెబ్బతిన్నాయని వెంటనే మరమ్మతులు కూడా చేయిస్తానని హామీనిచ్చారు.

మంగళ్‌హాట్‌లో నేటి నుంచి శ్రీ కృష్ణజన్మాష్టమి

అబిడ్స్: మంగళ్‌హాట్ పూసలబస్తీలో నేటి నుంచి రెండురోజుల పాటు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆర్కిటెక్ ఇంజినీర్, వాస్తుశిల్పి ఆవుల కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ ఆవుల అరుణ తెలిపారు. తన కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడారు. సోమవారం ఉదయం తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారి అభిషేకంతో వేడుకలు ప్రారంభమవుతాన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు హవనం, సాయంత్రం 7 గంటలకు భజన కీర్తనలు, రాత్రి 12 గంటలకు శ్రీకృష్ణ డోలారోహణం ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు సత్యనారాయణస్వామి వ్రతం, ఒంటిగంటకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు బాలబాలికలకు శ్రీకృష్ణ, యశోద, రాధా, గొల్లభామల వేషధారణ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు ఉట్టి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..?


అధ్వానంగా మారిన సాలర్‌జంగ్ కాలనీ రోడ్డు

గోల్కొండ: ఇటీవల కురిసిన వర్షాలకు టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్లలోని ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా కాలనీల రోడ్లు గుంతలమయంగా మారి వాహనాదారులకు నరకాన్ని చూపెడుతున్నాయి. ఫ్లోర్ మిల్ నుంచి సాలర్‌జంగ్‌కాలనీ వెళ్లే రోడ్డుపై వర్షాపు నీరు ఇంకా నిల్వ ఉన్నది. అదే విధంగా టోలిచౌకీ నుంచి ఎండీలైన్స్ వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా తయారైంది. టోలిచౌకీ చౌరస్తాను ఆనుకొని ఉన్న సూర్యనగర్, జానకీనగర్ కాలనీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. నిజాం కాలనీలోని టోలిచౌకీ వచ్చే రోడ్డు సైతం పూర్తిగా కంకర తేలింది. ఈ రోడ్డుపై నుంచి రావాలంటేనే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

'ఫార్మా కంపెనీల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి'


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ యాదయ్య

అంబర్‌పేట: సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఫార్మా వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఫార్మా వ్యతిరేక కమిటీ ప్రతినిధి మాజీ సర్పంచ్ యాదయ్య మాట్లాడారు. సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి సారథ్యంలో దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, ఆర్‌టీ తండా, కుంటతండా, ఈర్లపల్లి, తండాల్లోని 1375 ఎకరాల పట్టా భూముల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేయబోతున్నారన్నారు. ప్రభుత్వ భూముల్లో పెడితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఇందుకోసం మైలారాం గ్రామంలో 2 వేల ఎకరాలు, లగచర్ల, దుద్యాలలో 7 వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, అవసరం అయితే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ప్రతినిధులు సురేశ్, చాకలి శ్రీకాంత్, సామాలి శ్రీశైలం, రాచూరి ఆనంద్, అక్షయ్‌కుమార్ ఉన్నారు.

కళాకారులకు ఐకాన్–2024 అవార్డుల ప్రదానం


అవార్డులతో మంజుల, అక్షయ, శివానీ

యాకుత్‌పురా: అంతర్జాతీయ జానపద దినోత్సవం సందర్భంగా పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ కళల వేదిక సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నగరంలోని శ్రీత్యాగరాయగాన సభలో ఐకాన్ అవార్డు–2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాతబస్తీకి చెందిన మంజుల డ్యాన్స్ అకాడమీ కళాకారులు అవార్డులు పొందారు. కార్యక్రమానికి అసెంబ్లీ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, తెలంగాణ కళల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పేరాల శేఖర్ రావు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.మురళీ మోహన్ రాజు ముఖ్య అతిథులుగా హాజరై డ్యాన్స్ అకాడమీ నిర్వాహకురాలు మంజులతో పాటు భరత నట్యంలో ఉత్తమ ప్రదర్శన చేసిన పార్వతి అక్షయ, కే. శివానీకి అవార్డులు అందజేశారు.